# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఆధ్యాత్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో పాటు పౌరులందరూ కీలక పాత్ర పోషించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు.
- ప్రపంచ పాలనా వ్యవస్థల్లో 'గ్లోబల్ సౌత్' కు తగిన ప్రాతినిధ్యం ఉండాలని జీ-20 సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.
- కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు నూతన కార్మిక చట్టాలను అంతర్జాతీయ సంస్థలు స్వాగతించాయి.
- మలక్కా జలసంధిపై ఏర్పడిన అల్పపీడనం బలపడి ఈ నెల 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది.

============================

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఆధ్యాత్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు రంగంతో పాటు పౌరులందరూ కీలక పాత్ర పోషించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఈ రోజు రాష్ట్రపతి పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. సాయి కుల్వంత్ హాల్‌లో బాబా మహాసమాధికి నివాళులర్పించిన అనంతరం అక్కడ నిర్వహించిన సదస్సులో ప్రసంగించారు. సత్యసాయి బాబా తన జీవితాన్ని సమాజ శ్రేయస్సుకే అంకితం చేశారని రాష్ట్రపతి కొనియాడారు.

శ్రీ సత్యసాయి శత జయంతి వేడుకల్లో ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ ఈ రోజు పాల్గొన్నారు. పుట్టపర్తిలోని సత్యసాయి మహా సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం.. శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... 2047 నాటికి భారత్ అభివృద్ధిలో అగ్రస్థానానికి చేరుతుందని తెలిపారు. విద్యార్థులకు నైతిక విలువలు నేర్పే కేంద్రంగా సత్యసాయి విద్యా సంస్థ విలసిల్లుతోందని సీ పీ రాధాకృష్ణన్ పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

============================

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి నమూనాలను నిర్దేశించడంలో జీ-20 కూటమి కీలకంగా వ్యవహరిస్తున్నప్పటికీ.. ప్రస్తుతం అమలవుతున్న విధానాలను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ప్రస్తుత నమూనాలు అధిక జనాభాకు వనరులను దూరం చేయడంతో పాటు ప్రకృతిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్ బర్గ్‌లో తొలిసారిగా జరుగుతున్న జీ-20 శిఖరాగ్ర సదస్సులో భాగంగా ఈ రోజు జరిగిన మొదటి సెషన్‌లో నరేంద్ర మోదీ ప్రసంగించారు. గతంలో న్యూఢిల్లీ వేదికగా జరిగిన జీ-20 సదస్సులో తీసుకున్న చారిత్రక నిర్ణయాలు ఇప్పుడు కార్యరూపం దాల్చుతుండటం సంతోషకరమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రపంచ పాలనా వ్యవస్థల్లో 'గ్లోబల్ సౌత్' కు తగిన ప్రాతినిధ్యం ఉండాలని ఆయన పునరుద్ఘాటించారు. భారతీయ సనాతన విజ్ఞానంలో భాగమైన `ఏకాత్మతా మానవతావాదం` ప్రకృతితో మమేకమై సాగే ప్రగతికి దిక్సూచిగా నిలుస్తుందన్నారు. భారతీయ విజ్ఞాన వ్యవస్థల ఆధారంగా.. జీ-20 ఆధ్వర్యంలో `గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపాజిటరీ`ని ఏర్పాటు చేయాలని నరేంద్రమోదీ ఈ సందర్భంగా సూచించారు.

============================

జీ-20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, కెనడా ప్రధాని మార్క్ కార్నీలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా-కెనడా- ఇండియా టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ (ACITI) పార్ట్‌నర్ షిప్ ను ప్రారంభిస్తున్నట్లు నరేంద్రమోదీ సోషల్ మీడియా పోస్టులో వెల్లడించారు. మూడు ఖండాలు, మూడు మహాసముద్రాల మధ్య ఉన్న ఈ ప్రజాస్వామ్య దేశాల సహకారాన్ని ఏసీఐటీఐ మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. కొత్త సాంకేతికతలు, సరఫరా గొలుసుల వైవిధ్యీకరణ, స్వచ్ఛ ఇంధనం, కృత్రిమ మేధ (ఏఐ) వంటి రంగాల్లో కలిసి పని చేయడానికి ఎదురుచూస్తున్నామని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో కూడా సమావేశమయ్యారు.

============================

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు నూతన కార్మిక చట్టాల అమలుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయాన్ని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) స్వాగతించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కార్మికుల పక్షాన చేపట్టిన అతిపెద్ద సంస్కరణ ఇదేనని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి గిరీష్ ఆర్య అభివర్ణించారు. దేశంలో అసంఘటిత రంగంలో పని చేస్తున్న సుమారు 50 కోట్ల మంది కార్మికులకు కొత్త లేబర్ కోడ్స్ అమలుతో కనీస వేతనం కచ్చితంగా అందుతుందని నేషనల్ ఫ్రంట్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (ఎన్ఎఫ్ఐటీయూ) జాతీయ అధ్యక్షులు డాక్టర్ దీపక్ జైస్వాల్ తెలిపారు. భారత కార్మిక సంస్కరణల ప్రయాణంలో ఇదో కీలక ముందడుగు అని ఐటీ పరిశ్రమల సమాఖ్య 'నాస్కామ్' వ్యాఖ్యానించింది.

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు నూతన కార్మిక చట్టాలను అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO), అంతర్జాతీయ సామాజిక భద్రతా సంస్థ (ISSA) వంటి అంతర్జాతీయ సంస్థలు స్వాగతించాయి. ఈ సంస్కరణలు సామాజిక భద్రతను బలోపేతం చేయడంలో, కనీస వేతన చట్టాలను మెరుగుపరచడంలో ఒక ప్రధాన ముందడుగుగా అంతర్జాతీయ సంస్థలు అభివర్ణించాయి.

విరామం

============================

ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కేంద్ర మంత్రి, భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు జే పీ నడ్డా న్యూఢిల్లీలో 'సర్దార్@150' పేరిట నిర్వహించిన సమైక్యతా ర్యాలీ (యూనిటీ మార్చ్)ను ఈ రోజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఘన వారసత్వాన్ని స్మరించుకుంటూ.. ఆయనకు నివాళిగా దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. దేశంలోని ఐదు వేర్వేరు ప్రాంతాల నుంచి బయలుదేరే ఈ ర్యాలీలు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జన్మస్థలానికి చేరుకుంటాయని వివరించారు. అక్కడి నుంచి గుజరాత్‌లోని కేవడియా వరకు 10 రోజుల పాటు పాదయాత్ర సాగుతుందని తెలిపారు. `ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్`, `వికసిత్ భారత్`, `ఆత్మనిర్భర్ భారత్` సాధన దిశగా దేశ యువతను చైతన్య పరచడమే పటేల్‌కు మనం అర్పించే నిజమైన నివాళి అని జేపీ నడ్డా ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

==============================

ముగ్గురు కీలక రాష్ట్ర కమిటీ సభ్యులతో సహా మొత్తం 37 మంది మావోయిస్టులు ఈ రోజు హైదరాబాద్‌లో తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారంతా తమ ఆయుధాలను కూడా అప్పగించినట్లు డీజీపీ తెలిపారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నట్లు వెల్లడించారు. మిగతా 34 మంది మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని తెలియజేశారు.

==============================

సరకు రవాణాలో భారతీయ రైల్వే గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఏకంగా 1,020 మిలియన్ టన్నుల సరకు రవాణా (లోడింగ్) చేసినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. ఇందులో అత్యధిక వాటా బొగ్గుదే కావడం విశేషం. మొత్తం రవాణాలో 500 మిలియన్ టన్నులకు పైగా బొగ్గును రవాణా చేయగా.. ఆ తర్వాతి స్థానాల్లో ఇనుప ఖనిజం (115 మిలియన్ టన్నులు), సిమెంట్ (92 మిలియన్ టన్నులు) ఉన్నాయని అధికారులు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే రోజువారీ లోడింగ్‌లోనూ పురోగతి కనిపించింది. గత ఏడాది రోజువారీ లోడింగ్ సగటున 4.2 మిలియన్ టన్నులు ఉండగా.. ప్రస్తుతం అది 4.4 మిలియన్ టన్నులకు పెరిగింది. రైల్వే నిర్వహణ సామర్థ్యం మెరుగుపడటం, రవాణాకు డిమాండ్ స్థిరంగా ఉండటమే ఈ వృద్ధికి కారణమని రైల్వే శాఖ పేర్కొంది.

==============================

పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ (ISI) అండతో నడుస్తున్న ఓ భారీ అంతర్జాతీయ ఆయుధాల అక్రమ రవాణా ముఠాను ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుండి 10 అత్యాధునిక పిస్టళ్లను క్రైం బ్రాంచ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో తుర్కియేలో తయారైనవి 5 కాగా, చైనాకు చెందినవి 3 ఉన్నట్లు గుర్తించారు. ఢిల్లీలో ఈ రోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ (క్రైం) సురేందర్ కుమార్ ఈ వివరాలను వెల్లడించారు. పాకిస్థాన్ నుంచి డ్రోన్ల ద్వారా అత్యాధునిక విదేశీ ఆయుధాలను దేశంలోకి స్మగ్లింగ్ చేస్తున్నారని, వాటిని ఇక్కడి కరుడుగట్టిన గ్యాంగ్ స్టర్లకు సరఫరా చేస్తున్నారని ఆయన తెలిపారు.

==============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు.

==============================

మలక్కా జలసంధిపై అల్పపీడన ప్రాంతం క్రమంగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. ఇది ఈనెల 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ వాయుగుండం ప్రభావంతో అండమాన్ నికోబార్ దీవులు, దక్షిణ ద్వీపకల్పంలోని (సౌత్ పెనిన్సులా) కొన్ని ప్రాంతాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ శాస్త్రవేత్త అమిత్ కుమార్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

==============================